2న ఇంజినీరింగ్ స్పాట్ అడ్మిషన్స్

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 30: ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు వచ్చే నెల 2వ తేదీన స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. బయోమెడికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. కళాశాలలోని అసెంబ్లీ హాల్‌లో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు స్పాట్ అడ్మిషన్స్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఒంటి గంట తరువాత వచ్చిన వారిని ఎట్టిప రిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. విద్యార్థి ఒరిజినల్ టీసీ తీసుకొని వస్తేనే అడ్మిషన్‌కు అనుమతిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఇతర ఇంజినీరింగ్ కళాశాలలో సీట్లు తీసుకోని వారు మాత్రమే దీనికి అర్హులని అన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు అర్హులు కాదని పేర్కొన్నారు. ఈ కోటా కింద చేరే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని, హాస్టల్ సదుపాయం సైతం కల్పించబోమని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సహా హాజరుకావాలని సూచించారు.

బీఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును సెప్టెంబర్ 10వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పీజీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును మరోసారి పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎమ్మెస్సీ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ అన్ని కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫీజును రూ.300 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 2లోగా చెల్లించవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

- సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన
- చవితి సందర్భంగా తగిన ఏర్పాట్లు చేయాలి
- సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆదేశం

సీసీరోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న సికింద్రాబాద్ ఎమ్మె ల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, ఆగస్టు 30: చవితి సందర్భంగా అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు. మైలార్‌గడ్డ నుంచి నామాల గుండు వరకు రూ.53 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడ్డగుట్ట, సీతాఫల్‌మండి, మెట్టుగూడ, తార్నాక, బౌద్ధనగర్ డివిజన్ల పరిధిలో అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు జరపాలని అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యేతో అధికారుల సమావేశం

సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళికాధికారి శ్రీనివాస్‌రావు, మారేడుపల్లి తహసీల్దార్ భూపతిగౌడ్ శుక్రవారం ఎమ్మెల్యే పద్మారావుతో సమావేశమయ్యారు. పట్టణ ప్రణాళికా విభాగం కార్యకలాపాలను ప్రజలకు అందుబాటులో నిలపాలని, కొత్త భవనాల నిర్మాణాల్లో పారదర్శకతను పాటించాలని, దళారీ ప్రమేయం లేకుండా ఏర్పాట్లు జరపాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన ఆగత్యం నివారించాలన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


సీఎం సహాయ నిధి చెక్కులు అందుకుంటున్న లబ్ధిదారులు

బేగంపేట్, ఆగస్టు 30: పేదలకు అత్యవసర పరిస్థితుల్లో సీఎం సహాయ నిధి చేయూతతో స్వాంతన చేకూరుతోందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన 28 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే శుక్రవారం ఉదయం తన నివాసంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో కలిసి అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నానని, ఎవరికి ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి శ్రీహరి, కొలను లక్ష్మిబాల్‌రెడ్డి, కూర హేమలత, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ నాయకులు అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, హనుమంతరావు, వెంకటేశన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యుడిగా ఉండి మృతి చెందిన జంగయ్య కుటుంబ సభ్యులకు మ్యూచివల్ బెనిఫిట్ ఫండ్ (ఎంబీఎఫ్) సస్పెండ్ అమౌంట్ చెక్కును శుక్రవారం సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి సికింద్రాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో అందజేశారు. జనరల్, స్పెషల్ లోన్ దాదాపు రూ.3లక్షలు మాఫీ చేస్తూ.. రూ.3,08,655 చెక్కును జంగయ్య భార్య పద్మకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ రవి శంకర్, డెలిగేట్ రాజేందర్, ఎంబీఎఫ్ సెక్షన్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. - మారేడ్‌పల్లి

సంతోషిమాత ఆలయంలో శ్రావణమాస పూజలు

సంతోషిమాత ఆలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 30: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా జీరాలోని సంతోషిమాత ఆలయంలో పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, అభిషేకాలు, పసుపు బొట్టు, మహా అన్నదానం నిర్వహించారు. పూజలకు రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు జి.పవన్‌కుమార్‌గౌడ్, గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ డి.రాజు హాజరయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మనోజ్‌కుమార్‌గౌడ్, కార్యదర్శి ప్రేమ్‌కుమార్, సభ్యులు గణేశ్, కృష్ణరాజు, సంజయ్, కుమార్ యాదవ్, అరుణ్‌గౌడ్ పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయాలకు పాల్పడుతున్న కేంద్రం

హిమాయత్‌నగర్: మతోన్మాద రాజకీయాలకు కేంద్రం పాల్పడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నరసింహ, నగర కార్యదర్శి ఛాయాదేవి ఆరోపించారు. సాయుధ పోరాట వారోత్సవాలకు ప్రచార కటౌట్‌ను ఎస్ఎన్ రెడ్డి భవన్ వద్ద ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్రకార్యనిర్వహక అధ్యక్షుడు శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, సీపీఐ నేతలు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ సూడో పాలిటీషియన్

జర్నలిస్టులకు ఎంపీ ఈటల క్షమాపణ చెప్పాలి

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 30: నాలుగు దశాబ్దాలుగా నిఖార్సైన జర్నలిస్టుగా కొనసాగుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను 'సూడో జర్నలిస్టు' అంటూ అవహేళన చేసిన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ జర్నలిస్టులకు వెంటనే క్షమాపణ చెప్పాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఇ.చంద్రశేఖర్ అన్నారు. సమకాలీన రాజకీయ, సామాజిక అంశాలపై లోతైన విశ్లేషణ చేస్తూ సమాజ హితం కోసం తన కలాన్ని, గళాన్ని వినిపిస్తున్న ప్రొఫెసర్ నాగేశ్వర్ పట్ల, సోషల్, డిజిటల్ మీడియా పట్ల అనుచిత వ్యాఖ్యాలు చేయడం తగదన్నారు. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీలు మారే ఈటల రాజేందర్ నీతిమాలిన తనానికి నిదర్శనమని అన్నారు. ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని ఈటల అసలైన 'సూడో పొలిటీషియన్' అని అన్నారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పకపోతే జర్నలిస్టుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

చిన్నారి భౌతికకాయానికి డిప్యూటీ మేయర్ నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 30: హబ్సిగూడలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి కామేశ్వరి భౌతికకాయానికి నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కామేశ్వరి స్వగృహానికి వెళ్లిన డిప్యూటీ మేయర్ చిన్నారి తల్లిదండ్రులను ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు

జలమండలి అధికారులతో కలిసి బ్రాహ్మణ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, ఆగస్టు 30: తాగు నీటిలో కలుషిత జలాలు సరఫరా కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. డివిజన్ పరిధిలోని బ్రాహ్మణ బస్తీలో కలుషిత నీరు వస్తుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి సమస్యను తీసుకురాగా అధికారులతో కలిసి శుక్రవారం ఆప్రాంతంలో పరిశీలించారు. నూతన పైప్‌లైనుకు ఇప్పటికే ప్రపోజల్ పెట్టామని తెలిపారు. మంజూరు కాగానే పనులు మొదలు పెడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ ప్రియాంకతో పాటు బీజేపీ నాయకులు అజయ్‌నాయుడు, వి.సతీశ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ బాలస్వామి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 30: గణేశ్ నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి సూచించారు. శాంతిభద్రతలను ఉల్లంఘిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈస్ట్ జోన్‌కు సంబంధించిన రౌడీషీటర్లకు వినాయక చవితి నేపథ్యంలో చిలకలగూడ ఏసీపీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు. ఎటువంటి సమస్య తలెత్తినా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎం.నర్సయ్య, ఏసీపీలు జైపాల్ రెడ్డి, గ్యార జగన్, స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు, డీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

వ్యాధులు-నివారణ చర్యలపై అవగాహన

తిరుమలగిరి చిన్న కమేళా బస్తీలో అవగాహన ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

బొల్లారం, ఆగస్టు 30: దోమలను నిర్మూలించి, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అవంతి అన్నారు. శుక్రవారం ఏడో వార్డు చిన్న కమేళా బస్తీలో దోమల ద్వారా వచ్చే వ్యాధులు-నివారణ చర్యలపై తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, కంటోన్మెంట్ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యురాలు అవంతి మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్‌గా ప్రొఫెసర్ చెన్నప్ప

డి.చెన్నప్ప

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 30: ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్‌గా ప్రొఫెసర్ డి.చెన్నప్ప నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీన్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ గంగాధర్ పదవీ కాలం ముగియడంతో ఈ నియామకాన్ని చేపట్టారు. గతంలో ప్రొఫెసర్ చెన్నప్ప కామర్స్ విభాగం హెడ్‌గా, సికింద్రాబాద్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్, ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ తదితర బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

నిరాశ్రయులకు బాసటగా నిలవాలి

హిమాయత్‌నగర్: కేరళలోని వయనాడ్‌లో వరదలతో నిరాశ్రయులైన ప్రజలకు బాసటగా నిలవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. వరద బాధితుల కోసం సేకరించిన నిధిని శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో బాల్‌రాజ్‌కు జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కార్య నిర్వాహక అధ్యక్షుడు బొడ్డుపల్లి కిషన్ అందజేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అందరి బాధ్యత అని, దాతలు ముందుకు రావాలని పేర్కొన్నారు.

వర్సిటీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయండి


ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను సన్మానిస్తున్న ఔటా ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 30: రాష్ట్రంలోని వర్సిటీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఓయూ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) ప్రతినిధులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కోరారు. అధ్యాపకుల పలు సమస్యలు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్నాయని గుర్తుచేశారు. కోదండరాం ఎమ్మెల్సీగా ఎన్నికైన నేపథ్యంలో ఔటా ప్రతినిధులు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు. అధ్యాపకుల పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచే విషయాన్ని పరిశీలించాలని అభ్యర్థించారు. ఉద్యోగుల పదవీ విరమణ వయసును పెంచినప్పటికీ, అధ్యాపకుల పదవీ విరమణ వయసును పెంచలేదని గుర్తుచేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సీపీఎస్ సమస్యను పరిష్కరించేందుకు పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఔటా ప్రతినిధులు ప్రొఫెసర్ ఎన్.కిషన్, ప్రొఫెసర్ సురేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, ప్రొఫెసర్ హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి సేఫ్టీ జాకెట్లు

సనత్‌నగర్ జెక్‌కాలనీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాలనీలోని స్ట్రీట్ నంబర్ 3లో పారిశుధ్య సిబ్బందికి షూస్, సేఫ్టీ జాకెట్లు పంపిణీ చేశారు. దాతలు సునీల్, శశికళ, డీపీ నాయుడు, మొక్కపాటి భాస్కరం చేయూతతో కాలనీలో సిబ్బందికి అందజేశారు. కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ మల్లుప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి.రజనీకాంత్‌రెడ్డి, ఏఎంవోహెచ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఫెడరేషన్ సలహాదారుడు చింతిరెడ్డి అనంతరెడ్డి, కంజర్ల శ్రీనివాస్‌యాదవ్, ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి వెంకట్ సోమ, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు. - అమీర్‌పేట్

బాపూనగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

బాపూనగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అమీర్‌పేట్, ఆగస్టు 30: బాపూనగర్ బస్తీలో అధిక విద్యుత్ వినియోగం కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర తరుచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో బస్తీ వాసులతో కలిసి బాపూనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరిసింగ్‌జాదవ్ ఎక్కువ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం చేసిన విజ్ఞప్తి ఫలించింది. విద్యుత్ అధికారులు శుక్రవారం బస్తీలో ఇప్పటి వరకు ఉన్న 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 కేవీఏను ఏర్పాటు చేశారు. దీంతో పాటు బస్తీవాసులకు సౌకర్యవంతంగా ఉండేలా అదనంగా 7 విద్యుత్ స్తంభాలను కూడా ఏర్పాటు చేయడంతో విద్యుత్ సమస్యలకు తెరపడింది. అడిగిన వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను కేటాయించడం పట్ల బస్తీ అధ్యక్షుడు హరిసింగ్ జాదవ్ ట్రాన్స్‌కో ఏడీఈ కిశోర్‌కుమార్, ఏఈలు మురళీధర్, మదన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

పూజల్లో పాల్గొన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

సికింద్రాబాద్, ఆగస్టు 30: బీజేపీ మాజీ కార్పొరేటర్ స్వరూప నివాసంలో శ్రావణమాస వరలక్ష్మి వేడుకలు జరిగాయి. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరయ్యారు. అమ్మ వారికి పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ నాయకులు గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, శైలజ, నాయకులు రవి ప్రసాద్‌గౌడ్, అజయ్‌నాయుడు, ప్రభుగుప్త, అంబాల రాజేశ్వర్‌రావు, శారద, నగరపు శ్యాం, సేతి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం దత్తాత్రేయ సీతాఫల్‌మండిలో పర్యటించారు. మేడిబావిలో పార్టీ నాయకుడు కనకట్ల హరి అరవింద్ నివాసానికి వెళ్లారు.

నామాలగుండులోని గంగపుత్ర వెల్ఫేర్ సొసైటీలో మహిళా సంఘం నేత రాచమల్ల స్వర్ణలత ఆధ్వర్యంలో వరలక్ష్మీ పూజ జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, బౌద్ధనగర్ కార్పొరేటర్ శైలజ, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, సంఘం నాయకులు గడప శ్రీహరి, కర్మకొండ సత్యనారాయణ, చంద్రగిరి ఎల్లయ్య, కట్కూరి రమేశ్, దేశబోయిన నర్సింగ్‌రావు, పాక గాలేశ్, ఎర్రబోయిన మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ దవాఖానలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేసి శుక్రవారం పదవీ విరమణ చేసిన భమిడిపాటి రామయ్య దంపతులను గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారి సన్మానించి, అభినందనలు తెలిపారు. అటు డీఎంఈ కార్యాలయం, ఇటు గాంధీ దవాఖానలో ఆయన అందించిన సేవలను ఆమె కొనియాడారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబోధ్‌కుమార్, గ్యాస్ట్రో ఎంటరాలజీ హెచ్ఓడీ డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రి పాల్గొన్నారు. - బన్సీలాల్‌పేట్

గణేశ్ విగ్రహాల వ్యాపారులు మిగిలిన వాటిని రోడ్లపైనే వదిలి వెళుతుండడం అందరి మనోభావాలను దెబ్బ తీస్తోందని బీజేపీ నాయకులు లింగంపల్లి నర్సింగ్‌రావు అన్నారు. గతేడాది విగ్రహాలను తరలించకుండా రోడ్లపైనే వదిలి వెళ్లారని గుర్తుచేశారు. భవిష్యత్తులో ఇటువంటి సమస్య తలెత్తకుండా రోడ్లపై వ్యాపారాలు చేసే వారి వివరాలు సేకరించాలని, మిగిలిపోయిన విగ్రహాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డిని కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. నాయకులు ఆకుల మహేశ్ పటేల్, దశరథ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, వెంకటరమణ ఉన్నారు. - అమీర్‌పేట్

PUBLIC NOTICE

The General public is hereby informed that my Client Mr. SALLA SAILU, S/o. Late S.Kistaiah has entered into Agreement of Sale to purchase all the Southern side portion of H.No. **6-4-353/1, on shop No. 1, in Survey No. 87,** along with land admeasuring 127 Sq.yards or 106.17 Sq.mtrs., **situated at Bholakpur, Secunderabad, T.S.** which is bounded on North: Remaining Portion of H.No. 6-4-353/1, South: Neighbours House, East: Neighbours House, West: 40' Wide Road from **Smt. SAMATHA RALLABANDI, W/o. R.RAJESH KUMAR, D/o. Late T.S. RAVI KUMAR,** Resident of Amberpet, Hyderabad and has paid considerable amount as Advance Sale Consideration.

If any Person(s)/financial institutions are having any objection, claim, interest, dispute over the above intended Sale transaction, they may contact the undersigned with all documentary proof substantiating their claim within 5 days from the date of this publication. Take notice that if no objection/claims are received within the period prescribed above, my clients shall proceed to complete the Sale transaction with the above owners as if there are no third party claims/objections in respect of the above said property and thereafter no claims/ objections will be entertained. Hence this notice.

Sd/- M.SUDHEER KUMAR, Advocate
H.No. 1-3-1/14/1, Lal Bahadur Nagar Colony, Kawadiguda, Hyderabad-500 080,
Mobile: 9246555150.
Dated 31-08-2024